# 30 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీం అనుమతి

**14 ఏండ్ల బాలిక కేసులో అసాధారణ తీర్పు**

న్యూఢిల్లీ: లైంగికదాడికి గురై గర్భం దాల్చిన 14 ఏండ్ల బాలికకు సర్వోన్నత న్యాయస్థానం ఉపశమనం కల్పించింది. ఆమె 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకునేందుకు అనుమతి ఇచ్చింది. చట్ట ప్రకారం 24 వారాల గర్భవిచ్ఛిత్తికి మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ ప్రస్తుత కేసులోని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రాజ్యాంగంలోని అధికరణ 142 ప్రకారం ప్రత్యేక అధికారాలను వినియోగించి సుప్రీంకోర్టు తాజా తీర్పు వెలువరించింది. మైనర్ బాలిక సంక్షేమమే అతి ముఖ్యమైనదని స్పష్టం చేసింది. మహారాష్ట్రకు చెందిన 14 ఏండ్ల బాలిక లైంగికదాడికి గురై గర్భం దాల్చింది. ఆలస్యంగా విషయం తెలుసుకున్న ఆమె తల్లి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన కుమార్తె 26 వారాల గర్భాన్ని తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. అయితే కోర్టు అందుకు నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బాంబే హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు.. బాలికకు గర్భస్రావం చేయడానికి తక్షణమే వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ముంబైలోని లోకమాన్య తిలక్ మునిసిపల్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ డీన్‌ను ఆదేశించింది. ఆమెకు ప్రయాణ సదుపాయం కల్పించాలని హాస్పిటల్ పరిపాలనా యంత్రాంగాన్ని ఆదేశించింది. గర్భస్రావం తర్వాత అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని కూడా చెప్పింది.

# ఐదేండ్ల వ్యవధితో షెంజెన్ వీసా

**భారతీయులకు ఈయూ శుభవార్త**




న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: షెంజెన్ వీసాతో యూరప్ దేశాలలో పర్యటించే భారతీయులకు యూరోపియన్ కమిషన్ శుభవార్త చెప్పింది. వీసా కోడ్‌లో ప్రస్తుత నిబంధనల్ని మార్చుతూ, 5 ఏండ్లపాటు చెల్లుబాటు అయ్యే మల్టీపుల్ ఎంట్రీ షెంజెన్ వీసాను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై భారత్‌లో ఈయూ రాయబారి హెర్వ్ డెల్ఫిన్ స్పందిస్తూ, ఇరు వైపులా ఉన్న ప్రజల సంబంధాల్ని పెంపొందించే దిశగా మరో అడుగు పడిందని అన్నారు. 'భారతీయులకు మల్టీపుల్ ఎంట్రీ వీసాలను జారీచేయటంపై కొన్ని ప్రత్యేక నిబంధనలకు ఏప్రిల్ 18న యూరోపియన్ కమిషన్ ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతమున్న వీసా కోడ్ ప్రామాణిక నిబంధనల కంటే ఇది చాలా అనుకూలమైంది' అని ఈయూ ఒక ప్రకటన విడుదల చేసింది.

# సీయూఈటీ, నెట్ స్కోర్ల నార్మలైజేషన్‌కు స్వస్తి

**ఈ ఏడాది నుంచే అమలు: యూజీసీ**




న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ)-యూజీ, నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) రాసే విద్యార్థులకు యూజీసీ శుభవార్త చెప్పింది. ఈ ఏడాది నుంచి ఈ రెండు టెస్టుల్లో స్కోర్ల నార్మలైజేషన్‌కు ముగింపు పలుకుతున్నట్టు ప్రకటించింది. 'ఒక సబ్జెక్టుకు ఒకే షిఫ్ట్‌లో పరీక్షలు నిర్వహించనుండటం వల్ల ఈ ఏడాది నుంచి ఈ రెండు టెస్టులకు స్కోర్ల నార్మలైజేషన్ అవసరం ఉండదు' అని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం తగినన్ని పరీక్ష కేంద్రాలు అందుబాటులోకి రావడం వల్ల, ఓఎంఆర్ విధానంలో ఒకే రోజు పరీక్ష నిర్వహించే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని ఆయన తెలిపారు. మే 15-24 మధ్య సీయూఈటీ-యూజీ నిర్వహించనున్నారు. 15 సబ్జెక్టులకు ఆఫ్‌లైన్‌లో, 48 సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో టెస్ట్ ఉంటుంది. జూన్ 16న యూజీసీ-నెట్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఉంటుంది. స్కోర్ల నార్మలైజేషన్ తమ ప్రతిభపై ప్రభావం చూపుతుందని విద్యార్థులు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక సబ్జెక్టుకు వివిధ సెషన్లలో విభిన్నమైన ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించి విద్యార్థులకు వచ్చిన స్కోర్లను ఇతరులతో పోల్చడాన్నే స్కోర్ల నార్మలైజేషన్ అంటారు.

# మతమార్పిడికి నేహాపై ఒత్తిడి

- **ఆమె తండ్రి నిరంజన్ హీరేమత్ వెల్లడి**
- **కర్ణాటక పోలీసులు కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆగ్రహం**
- **సత్వర విచారణ కోసం ప్రత్యేక కోర్టు**
- **సీఎం సిద్ధరామయ్య ప్రకటన**
- **బాధితురాలికి మద్దతుగా బంద్ చేపట్టిన ముస్లింలు**

బెంగళూరు: కర్ణాటకలోని హుబ్బళి-ధార్వాడ్‌లో ఎంసీఏ విద్యార్థిని నేహా హీరేమత్ హత్యోదంతంపై నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఆమె కుటుంబ సభ్యులకు ముస్లింలు కూడా సంఘీభావం తెలుపుతున్నారు. బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు నిర్వహించింది. అయితే, ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫయాజ్ ఆమెను ఇస్లాంలోకి మత మార్పిడి చేసేందుకు ప్రయత్నించాడని ఆమె తండ్రి, హుబ్బళి-ధార్వాడ్ నగర పాలక సంస్థ కాంగ్రెస్ కౌన్సిలర్ నిరంజన్ హీరేమత్ సోమవారం ఆరోపించారు. ఈ కేసు దర్యాప్తులో హుబ్బళి-ధార్వాడ్ పోలీస్ కమిషనర్ రేణుక సుకుమార్, ఇతర పోలీసు అధికారులు కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమార్తె హత్య జరిగిన రోజే తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఇప్పటికి నాలుగు రోజులు గడచిపోయినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంసీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని నేహా హీరేమత్ హుబ్బళి-ధార్వాడ్‌లోని ఓ కళాశాలలో గురువారం హత్యకు గురైన సంగతి తెలిసిందే. నేహా, ఫయాజ్



తండ్రితో నేహా(ఫైల్)

ప్రేమించుకున్నారని కర్ణాటక హోం మంత్రి జీ పరమేశ్వర చెప్తుండగా, ఇది లవ్ జీహాద్ కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంటున్నారు.

**విచారణకు ప్రత్యేక కోర్టు: సీఎం**

నేహా హత్య కేసు దర్యాప్తు బాధ్యతలను క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగించాలని, సత్వర విచారణ కోసం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ప్రకటించారు.

**ముస్లింల బంద్**

నేహా హత్యను ఖండిస్తూ ధార్వాడ్‌లో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రదర్శన నిర్వహించారు. అంజుమన్-ఏ-ఇస్లాం ధార్వాడ్ శాఖ, ముస్లిం విద్యార్థులు ఈ ప్రదర్శనను నిర్వహించారు. నేహా కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు. ముస్లింలు నిర్వహించే దుకాణాలను ఒక పూట మూసివేశారు. ''నేహాకు న్యాయం జరగాలి'' అనే పోస్టర్లను ఏర్పాటు చేశారు.




## సెకన్లలో రీచార్జ్ అయ్యే 'సోడియం' బ్యాటరీ

**అభివృద్ధి చేసిన దక్షిణ కొరియా**

న్యూఢిల్లీ: సెకన్లలోనే రీచార్జ్ చేయగల, అధిక శక్తి కలిగిన హైబ్రిడ్ సోడియం అయాన్ బ్యాటరీని దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సాంకేతిక ఆవిష్కరణలో ఇదొక పెద్ద ముందడుగుగా నిపుణులు భావిస్తున్నారు. సోడియం అయాన్ హైబ్రిడ్ ఎనర్జీ స్టోరేజ్ సెల్స్ తయారీపై సైంటిస్టులు దృష్టిసారించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో అధిక శక్తితో కూడిన ఎలక్ట్రోకెమికల్ ఎనర్జీ స్టోరేజ్ పరికరాలకు ప్రస్తుతం పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. లిథియం అయాన్ బ్యాటరీలకు ఇది ప్రత్యామ్నాయంగా మారుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు. అధ్యయనంలోని ముఖ్యాంశాల్ని పేర్కొంటూ 'జర్నల్ ఎనర్జీ స్టోరేజ్ మెటీరియల్స్' తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం, ప్రస్తుతం తయారవుతున్న బ్యాటరీలన్నీ లిథియం ఖనిజంతోనే. ఇది భూమిపై స్వల్పంగా లభ్యమవుతున్నది. లిథియం లభ్యతతో పోల్చితే సోడియం లభ్యత 1000 రెట్లు ఎక్కువ. మన చుట్టూ ఉన్న వనరులతో పోల్చితే, సోడియం అయాన్‌ను రసాయన, విద్యుత్ శక్తి రూపంలో నిల్వ చేయటం చౌకైన, సాధ్యమయ్యే శక్తి వనరుగా నిలుస్తుంది.

# 'ఎవరెస్ట్'కు మరో షాక్!

- **మొన్న సింగపూర్.. నేడు హాంకాంగ్‌లో బ్యాన్**
- **ఎండీహెచ్ మసాలాలపై కూడా నిషేధం విధింపు**
- **ప్రమాదకర ఇథిలిన్ ఆక్సైడ్ మోతాదుకు మించడమే కారణం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): భారత్‌కు చెందిన మసాలా ఉత్పత్తుల కంపెనీ 'ఎవరెస్ట్'కు మరో షాక్ తగిలింది. ఇటీవల సింగపూర్‌లో వేటుకు గురైన ఈ కంపెనీపై తాజాగా హాంకాంగ్ కూడా బ్యాన్ విధించింది. ఎవరెస్ట్‌తో పాటు భారత్‌కు చెందిన మరో కంపెనీ ఎండీహెచ్‌కు చెందిన మసాలా ఉత్పత్తులపై కూడా నిషేధం విధిస్తున్నట్టు హాంకాంగ్‌కు చెందిన ఆహార భద్రత నియం




త్రణ సంస్థ (సీఎఫ్ఎస్) వెల్లడించింది. తమ పౌరులెవ్వరూ ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని సూచించింది. ఈ మసాలాల్లో ఇథలిన్ ఆక్సైడ్ మోతాదుకు మించి ఉన్నట్టు పేర్కొంది. కాగా, విదేశాల్లో నిషేధానికి గురైన ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాలు భారత్‌లో కూడా విక్రయిస్తుండటంతో ఫుడ్ సేఫ్టీ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అప్రమత్తమైంది. దేశంలోని పలు ప్రాంతాల నుంచి ఈ కంపెనీలకు చెందిన మసాలాలను సేకరించి ప్రయోగశాలలో నమూనాలను పరీక్షిస్తున్నట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి ఒకరు తెలిపారు. కాగా, 2023లో ఎవరెస్ట్ సాంబార్ మసాలా, గరం మసాలాను మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్స్ అథారిటీ ఆదేశించిన విషయం తెలిసిందే.

**ఏమిటీ ఇథిలిన్ ఆక్సైడ్?**

ఇథిలిన్ ఆక్సైడ్‌కు మండే స్వభావం ఉంటుంది. వ్యవసాయం, హెల్త్ కేర్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలలో పురుగుమందుల తయారీలో దీన్ని ఉపయోగిస్తారు. బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, కీటకాల నుంచి ఆహారాన్ని రక్షించడానికి కూడా వాడుతారు. మోతాదుకు మించి ఇది శరీరంలోకి చేరితే రొమ్ము క్యాన్సర్‌తో పాటు నాడీమండల వ్యవస్థ, మెదడు, డీఎన్ఏపై దుష్ప్రభావం చూపే ప్రమాదమున్నదని వైద్య నిపుణులు చెప్తున్నారు.

## భారీ బల్లి.. 74 టన్నులండి!

*అర్జెంటినాలో భారీ రాక్షసబల్లి(డైనోసార్) ఆనవాళ్లను పరిశోధకులు గుర్తించారు. ఈ డైనోసార్‌కు హిందూ దేవుడైన శివుడి పేరు స్ఫురించేలా 'శివ ది డెస్ట్రాయర్' నామకరణం చేశారు. ఈ పురాతన జంతువు 98 అడుగుల పొడవు, 74 టన్నుల బరువు ఉండి ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఈ డైనోసార్ ఇలా ఉండొచ్చని ఊహా చిత్రాన్ని విడుదల చేశారు.*



## మే 1 నుంచి మార్కెట్‌లోకి నానో యూరియా ప్లస్

న్యూఢిల్లీ: నానో యూరియా ప్లస్ ఎరువును మే 1 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంచుతామని ఇఫ్కో సోమవారం ప్రకటించింది. దీని ఉత్పత్తి ఈ వారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపింది. పంటలు ఎదిగేటపుడు ముఖ్యమైన సమయాల్లో నత్రజని అవసరాలను తీర్చేందుకు నానో యూరియా ప్లస్ ఉపయోగపడుతుందని తెలిపింది. నానో యూరియాను ఆధునికీకరించి తయారు చేస్తున్నదే నానో యూరియా ప్లస్ ఎరువు. ప్రస్తుతం 1-5 శాతం వెయిట్ బై వెయిట్ నత్రజనితో కూడిన నానో యూరియాను అందిస్తున్నది. నానో యూరియా ప్లస్‌లో నత్రజని 16 శాతం వెయిట్ బై వెయిట్ ఉంటుంది.



## విస్తరిస్తున్న హిమాలయ సరస్సులు: ఇస్రో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: భూతాపం వల్ల హిమాలయాల్లో మంచు పర్వతాలు కరిగి ఏర్పడుతున్న సరస్సులు మరింత విస్తరిస్తున్నాయని ఇస్రో తాజాగా వెల్లడించింది. 2016-17లో గుర్తించిన 2,431 సరస్సుల్లో 89 శాతం పెద్ద ఎత్తున విస్తరించాయని ఇస్రో నివేదిక తెలిపింది. వీటి పరిమాణం గత 38 ఏండ్లలో రెట్టింపు అయ్యిందని పేర్కొన్నది. భూ వాతావరణం వేడెక్కటం వల్లే భౌగోళిక మార్పులు సంభవించి హిమనీనదాలు కరిగిపోతున్న సంగతి తెలిసిందే. దీనివల్ల కొత్తగా సరస్సులు ఏర్పడటం, ఉన్న సరస్సులు విస్తరించి లోతట్టు ప్రాంతాల్ని వరదలు ముంచెత్తే ప్రమాదం ఉంటుందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. 1984 నుంచి 2023 వరకు భారతీయ హిమాలయ నదీ పరివాహక ప్రాంతాలను కవర్ చేసే దీర్ఘకాలిక ఉపగ్రహ చిత్రాలు విశ్లేషించిన ఇస్రో, నదులు, సరస్సుల పరిమాణంలో గణనీయ మార్పులు వచ్చినట్టు పేర్కొన్నది.

